సాక్షి
రంగారెడ్డి
గురువారం ı 6 ı మార్చి ı 2025




ఇక కొత్త కొత్తగా..

గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్త బస్సులు రోడ్డెక్కనున్నాయి. డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. 8లో▸



కులగణన చరిత్రాత్మకం

కులగణన చేయడం చరిత్రాత్మక విషయమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. 8లో▸



న్యూస్‌రీల్

దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూల వాతావరణం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్యకర్తల శ్రమతో బీజేపీకి దేశ వ్యాప్తంగా అనుకూల వాతావరణం నెలకొందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్టీ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షులు 1, 2 రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా దిమ్మె నిర్మాణానికి భూమి పూజ చేశారు. మహేశ్వరం ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి పార పట్టి మట్టి తీశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ మరింత పుంజుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. చేవేళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం 23వ డివిజన్‌లోని శివసాయినగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య పరిశీలించారు. కమిషనర్ సరస్వతితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, సామ సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, చిత్రం శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

నాగరాజుకు డాక్టరేట్



పరిశోధన పత్రాలు అందజేస్తున్న నాగరాజు

మంచాల: మంచాలకు చెందిన జాంగ్ల నాగరాజు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. జాంగ్ల శివయ్య, జయమ్మ దంపతుల కుమారుడైన ఆయన యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ చదివారు. ప్రొఫెసర్ కె.రమేశ్‌బాబు పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు గానూ ఆయనను అవార్డు వరించింది. నిరుపేద కుటుంబానికి చెందిన నాగరాజు గణిత శాస్త్రంలో డాక్టరేట్ సాధించడంపై మంచాలవాసులు హర్షం వ్యక్తంచేశారు.

రోడ్డు దాటుతుండగా..

కంటైనర్ ఢీకొని వ్యక్తి మృతి



శంకర్‌నాయక్(ఫైల్)

షాద్‌నగర్ రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కంటైనర్(లారీ) ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కేశంపేట బైపాస్ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుశీల తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంట తండాకు పంచాయతీ అనుబంధ గ్రామం తిమ్మాజిపల్లి తండాకు చెందిన శంకర్‌నాయక్(58) పని నిమిత్తం పట్టణానికి వచ్చాడు. సాయంత్రం ఆయన కేశంపేట బైపాస్ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వైపు ప్రయాణిస్తున్న కంటైనర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్‌నాయక్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుమారుడు చందు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

కేశంపేట: అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లిలో గురువారం తెల్లవారుజామున కావలి రాఘవేందర్ అనే వ్యక్తి ఎలాంటి పర్మిషన్ లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పెట్రోలింగ్‌లో పోలీసులు అక్కడి చేరుకున్నారు. అప్పటికే మట్టి నింపిన టిప్పర్లను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పెట్రోలింగ్ డ్యూటీ కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు.

డెయిరీలు డీలా!

నష్టాల ఊబిలో ప్రభుత్వ పాడి పరిశ్రమలు

- నెలల తరబడి బిల్లులు అందక రైతుల అవస్థలు
- మదర్ డెయిరీ రూ.60 కోట్ల అప్పు
- విజయ డెయిరీ అప్పు రూ.100 కోట్లకు పైనే



కద్తాల్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఒకప్పుడు లాభాల బాటలో నడిచిన తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(విజయ డెయిరీ), నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం(నార్ముల్ మదర్ డెయిరీ) ప్రస్తుతం నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నాయి. పాలు పోసిన రైతులకు కనీసం నెలకోసారైనా బిల్లులు చెల్లించలేకపోతున్నాయి. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహకాలు అందక, బిల్లులు సక్రమంగా రాక రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంటున్నారు. ప్రైవేటు డెయిరీలకు పాలను విక్రయిస్తుండటంతో ప్రభుత్వ డెయిరీలు మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయి. వాస్తవానికి ఈ రెండు డెయిరీలు నెయ్యి, పాలపొడి, వెన్న, మజ్జిగ, దూద్ పేడా, లస్సీ, పెరుగు, ఐస్‌క్రీం, తదితర ఉత్పత్తులను తయారు చేస్తున్నప్పటికీ.. మార్కెటింగ్‌లో వెనుకబడిపోయాయి. ప్రైవేటు డెయిరీల నుంచి వస్తున్న పోటీని తట్టుకోలేక డీలా పడుతున్నాయి. ఉత్పత్తుల విక్రయాలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. దేవాదాయ శాఖకు నెయ్యి, అంగన్‌వాడీ కేంద్రాలను సరఫరా చేస్తున్నారు. ఆయా ఏజెన్సీల నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో నిధుల సమస్య తప్పడం లేదు.

భారీగా నష్టాలు

నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం(నార్ముల్ మదర్ డెయిరీ) రెండు జిల్లాల్లోని 24 చిల్లింగ్ కేంద్రాల నుంచి 98 వేల మంది రైతుల నుంచి రోజుకు సుమారు లక్ష లీటర్ల పాలను సేకరిస్తోంది. వీటిలో 65 వేల లీటర్ల పాలను బహిరంగ మార్కెట్లో విక్రయిస్తుండగా, మరో 35 వేల లీటర్ల పాలను పౌడర్, పెరుగుగా మారుస్తోంది. ప్రైవేటు డెయిరీల నుంచి పోటీ పెరగడం, డెయిరీ బ్రాండ్ ప్రమోటింగ్ కోసం అధికంగా ఖర్చు చేయడం, సేకరణ కంటే విక్రయాలు తక్కువగా ఉండటం, మిగిలిన పాలను పౌడర్‌గా మార్చే ప్రక్రియలో భాగంగా లీటర్‌కు రూ.15 చొప్పున నష్టపోతుండటం, కోవిడ్ సమయంలో పాల విక్రయాలు భారీగా తగ్గిపోవడం, ప్రభుత్వ ఏజెన్సీల నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడం, పరిపాలనా పరమైన ఖర్చులు రెట్టింపవడంతో భారీగా నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇప్పటికే డెయిరీ అప్పుల ఊబిలో చిక్కుకోవడంతో గత్యంతరం లేక స్థిరాస్తుల విక్రయానికి సిద్ధమైంది. ప్రస్తుతం ఈ డెయిరీకి రూ.60 కోట్ల అప్పులు ఉన్నాయి. దీంతో నల్లగొండ జిల్లా చిట్యాల, మిర్యాలగూడలో ఉన్న 29.36 ఎకరాల భూమిని విక్రయించాలని పాలక మండలి ఇప్పటికే తీర్మానించింది.

బిల్లుల చెల్లింపులో జాప్యం

తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(విజయ డెయిరీ) నష్టాలను ఎదుర్కొంటోంది. లక్షన్నర మంది రైతుల నుంచి రోజుకు సగటున 2.5 లక్షల నుంచి 3 లక్షల లీటర్ల పాలు సేకరిస్తోంది. ఇందుకు రైతులకు రోజుకు కనీసం రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆది నుంచి ప్రతి 15 రోజులకోసారి బిల్లులు చెల్లించే విధానం ఉండేది. నిధుల సమస్య వల్ల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతూనే ఉంది. రెండున్నర నెలలకు సంబంధించి సుమారు వంద కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. ఒక్క కద్తాల్ శీతల కేంద్రం పరిధిలోని రైతులకే రూ.16 కోట్లకుపైగా బకాయి పడినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే రావి ర్యాలలో రూ.246 కోట్లతో విజయ మెగా డెయిరీ నిర్మించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.74 కోట్లు, విజయ డెయిరీ రూ.26 కోట్లు వెచ్చించింది. మిగిలినది జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ వద్ద రుణం తీసుకుంది. రోజుకు 5 లక్షల లీటర్ల పాలశుద్ధి, 9 టన్నుల నెయ్యి సహా ఇతర ఉత్పత్తుల తయారీకి భారీ సామర్థ్యంతో ఈ డెయిరీని ఏర్పాటు చేశారు. తీసుకున్న రుణాలకు అప్పు కూడా భారీగా చెల్లించాల్సి వస్తుండటంతో రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి.

బీఆర్‌ఎస్ ఆందోళన

కద్తాల్: పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జర్పుల దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పాడి రైతులతో కలిసి చలో ప్రజాభవన్ పాదయాత్రకు కద్తాల్ నుంచి శ్రీకారం చుట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పలువురు నాయకులను అదుపులోకి తీసుకుని, పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శాపంగా మారిందని మండిపడ్డారు. పాడి రైతుల సమస్యలను అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేదంటే బాధితులతో కలిసి అసెంబ్లీతో పాటు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిచంద్, తులసీరాం, కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీలు గోపాల్, రంగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్లు వీరయ్య, సేవ్య పాల్గొన్నారు.

“ చాలా ఇబ్బందిగా ఉంది



గత 80 రోజుల నుంచి పాల బిల్లు రావడం లేదు. పాడి పోషణ, కుటుంబ పోషణ, పశుగ్రాసం కొనుగోలుకు చాలా ఇబ్బందిగా ఉంది. నేను రోజుకు 40 లీటర్ల పాలు విజయ డెయిరీకి పోస్తున్నా.. నాకు ఇప్పటి వరకు రూ.1.50 లక్షల బిల్లు రావాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి పాడి రైతులను ఆదుకోవాలి. - చేగూరి మహేశ్, కద్తాల్

రూ.13 లక్షలు రావాలి



ప్రతిరోజూ విజయ డెయిరీకి 320 లీటర్లు పాలు విక్రయిస్తున్నా. పదిహేను రోజులకు రూ.3.60 లక్షల బిల్లు వస్తుంది. రెండున్నర నెలలుగా చెల్లింపులు లేవు. ప్రస్తుతం రూ.13 లక్షలకు పైగా రావాలి. పనివాళ్లకు జీతాలు చెల్లించడం, దాణా, పశుగ్రాసం కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. బయట అప్పులు తెచ్చి డెయిరీ నిర్వహించాల్సిన దుస్థితి తలెత్తింది. - కడారి రామకృష్ణ, కద్తాల్

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై ప్రచారం చేయండి

ఆస్తిపన్ను వసూలు టార్గెట్ చేరుకోవాలి ● అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

పహాడీషరీఫ్: ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ విషయంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. బుధవారం ఆమె జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, టీపీఓ హబీబున్నీసాలతో పలువిషయాలపై చర్చించారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఎన్నిదరఖాస్తులు వచ్చాయని ప్రశ్నించారు. ఈ నెల 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వస్తుందనే విషయాన్ని అవగాహన కల్పించాలని చెప్పారు. ఆస్తిపన్ను వసూలుకు 25 రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో లక్ష్యాలను చేరుకునేలా బిల్‌కలెక్టర్లను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం 2025–26 సంవత్సరానికి గాను రూ.36 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ జ్యోతి, అకౌంటెంట్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించారు. షాహీన్‌నగర్‌లోని ఓ.ఎస్.జూనియర్ కళాశాల, గ్లోరీ జూనియర్ కళాశాలలకు విచ్చేసిన ఆమె ఆయా కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చూడాలని ఇన్విజిలేటర్లను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరీక్షా కేంద్రాల వద్ద వసతులు పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌కు సూచించారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు లేకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కార్పొరేటర్లకు స్పోర్ట్స్ మీట్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పాలకమండలి కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు 'స్పోర్ట్స్ మీట్' నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశంలో కొందరు సభ్యులు చేసిన విజ్ఞప్తి మేరకు జీహెచ్‌ఎంసీ ఇందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 7 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.3 వేల నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ఫైనల్స్‌లో గెలిచిన జట్లకు ఎక్సలెన్స్ అవార్డులు అందజేయనున్నారు. పది అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రస్తుత పాలకమండలికి చివరి సంవత్సరం కావడంతో కార్పొరేటర్ల వినతి మేరకు జీహెచ్‌ఎంసీ ఇందుకు సిద్ధమైంది.

చెరువుల మరమ్మతులు చేపట్టాలి



రాయపోల్ చెరువును పరిశీలిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ

ఇబ్రహీంపట్నం రూరల్: చెరువులు, కుంటల్లో నీరు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో వాటి మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల పరిధిలోని రాయపోల్‌లో ముదిరాజ్ సంఘం కార్యాలయం వద్ద మత్స్యకారుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. చెరువు నిండినా.. లీకేజీల వల్ల నీరు బయటకు పోతోందన్నారు. దీంతో మత్స్యకారు వృత్తి దారులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.10 లక్షలు బడ్జెట్ కేటాయించి చెరువుల్లో కంప చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, కాలుష్యం వల్ల మత్స్య సంపద చనిపోతే ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, రాయపోల్ సొసైటీ అధ్యక్షుడు మైలారం యాదయ్య, కార్యదర్శి రమేష్, పుల్లయ్య, మండల నాయకులు సురేందర్ పాల్గొన్నారు.

❖ అపురూప వేడుక



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న వేదపండితులు

చరికొండ వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం అత్యంత వైభవంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. రుక్మిణీసత్యభామా సమేత గోవిందుడి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను బ్యాండు మేళాలతో గ్రామంలో ఊరేగించారు. వేదపండితులు చక్రవర్తి శ్రీనివాసచార్యులు, రామచార్యులు, కృష్ణమాచార్యుల బృందం వేదమంత్రోచ్చారణ మధ్య కల్యాణం జరిపించారు. ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించేందుకు మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ నర్సింహ్మాగౌడ్, మాజీ ఎంపీటీసీ పాలకూర్ల రాములుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు. - కద్తాల్



స్వామివారి కల్యాణ వేడుకలో పాల్గొన్న మహిళా భక్తులు

సద్దుమణిగిన గోశాల వివాదం



ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న గోపాలకృష్ణ

మీర్‌పేట: జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలోని గోశాల వివాదం సద్దుమణిగింది. గోపాలకృష్ణ అనే వ్యక్తి కొన్నేళ్లుగా ఆలయంలో గోశాల నిర్వహిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన విషయాలు ఆలయ అధికారులకు తెలపకపోవడంతో గోశాలను తిరిగి అప్పగించాలని అధికారులు, మాజీ ధర్మకర్తలు పలుమార్లు కోరినా ఆయన నిరాకరించాడు. దీంతో బుధవారం గోపాలకృష్ణ, అతనికి మద్దతుగా స్థానిక బీజేపీ నాయకులు ఆలయం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గోశాలను తిరిగి అప్పగిస్తున్నట్లు గోపాలకృష్ణ ఒప్పంద పత్రం ఇవ్వడంతో వివాదం సమసింది.

ఊడ్చిన నిధులెన్నో?

రెండు నెలల్లోనే రూ.6 లక్షల పెనాల్టీలు



- బట్టబయలవుతున్న స్వీపింగ్ యంత్రాల పని తీరు
- ఏళ్ల తరబడి దోచుకున్న ప్రజా ధనమెంతో?

సాక్షి, సిటీబ్యూరో: ప్రజల నుంచి వివిధ పన్నుల రూపాల్లో వసూలు చేస్తున్న సొమ్మును జీహెచ్‌ఎంసీ కొందరు బడా కాంట్రాక్టర్ల పాల్జేస్తున్న వైనమిది. ఏళ్ల తరబడి ఎన్ని కోట్లు వారికి ధారాదత్తం చేశారో కానీ.. ఇటీవల చేపట్టిన తనిఖీల్లో సదరు కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్న స్వీపింగ్ మెషీన్ల పనితీరు బట్టబయలవుతోంది. ప్రధాన రహదారులను శుభ్రపరిచేందుకు జీహెచ్‌ఎంసీ అద్దె ప్రాతిపదిక స్వీపింగ్ మెషీన్లను నిర్వహిస్తోంది. వాటి కాంట్రాక్టర్లు ఒప్పందం మేరకు ఊడ్చాల్సినంత దూరం ఊడ్చకుండానే, శుభ్రం చేయాల్సిన మేర రోడ్లను శుభ్రం చేయకుండానే ఏడెనిమిదేళ్ల క్రితం రూ.30 కోట్ల నుంచి మొదలు పెట్టి ప్రస్తుతం ఏటా దాదాపు రూ. 47 కోట్లు జీహెచ్‌ఎంసీ నుంచి పొందుతున్నారు. కానీ.. ఒప్పందం మేరకు పనులు చేయకుండా పైకి కనిపించేందుకు మాత్రమే రోడ్లపై స్వీపింగ్ మెషీన్ల వాహనాలను తిప్పుతూ తూతూమంత్రంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాటి పని తీరుపై అనుమానం వచ్చిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సైతం తనిఖీలు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించిన నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీలతో వాటి పనితీరు బట్టబయలవుతోంది.

2 నెలలు.. రూ.6 లక్షల పెనాల్టీలు

ఈ సంవత్సరం జనవరి నుంచి నిర్వహించిన తనిఖీల్లో రెండు నెలల్లోనే స్వీపింగ్ మెషీన్లు సరిగ్గా పని చేయకుండా నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.6 లక్షల పెనాల్టీలు విధించారు. పలుమార్లు హెచ్చరికల తర్వాత సైతం ఇంతటి ఉల్లంఘనలు జరిగాయంటే.. అంతకుముందు ఎలాంటి పట్టింపు లేని సమయంలో అసలు పనిచేశాయో, లేదో అంచనా వేసుకోవచ్చు. ఆ లెక్కన ఎన్ని కోట్లు కాంట్రాక్టర్ల పరమయ్యాయో ఊహించుకోవచ్చు. గత పాలక మండళ్లలోని కీలకస్థానాల్లో ఉన్న వారి వల్లే.. సదరు కాంట్రాక్టర్లకు ఆ పనుల దక్కాయనే ఆరోపణలు గుప్పుమన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. వాటి పనితీరునూ పట్టించుకోలేదు.

తిలాపాపం.. తలా పిడికెడు

స్వీపింగ్ మెషీన్ల పని తీరు, తనిఖీలు, వాటి బిల్లుల చెల్లింపులు జోన్ల స్థాయిలో జరుగుతున్నాయి. సంబంధిత సర్కిళ్ల డీసీలు, ఏఎంఓహెచ్‌ల పాత్ర కూడా చెల్లింపుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. సరైన తనిఖీలు చేయకుండా, నిబంధనల ఉల్లంఘనలకు పెనాల్టీలు విధించకుండా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిధులు చెల్లించారనే ఆరోపణలున్నాయి. కొన్ని సర్కిళ్లలో గత రెండునెలల్లోనూ ఎలాంటి పెనాల్టీలు లేకపోవడం విశేషం. అంటే.. ఆ సర్కిళ్లలో స్వీపింగ్ మెషీన్లు కచ్చితంగా పని చేస్తున్నాయో, లేక సంబంధిత తనిఖీల అధికారులు మిలాఖాత్ అయ్యారో వారికే తెలియాలి.

రెండు నెలల్లో ఆయా సర్కిళ్లలో విధించిన పెనాల్టీలు

సర్కిల్	పెనాల్టీ (రూపాయలు)
శేరిలింగంపల్లి	3,80,000
మల్కాజిగిరి	64,000
రాజేంద్రనగర్	85,000
ఉప్పల్	25,000
కాప్రా	10,000
హయత్‌నగర్	10,000
ఫలక్‌నుమా	10,000
కార్వాన్	15,000
గోషామహల్	11,000
అల్వాల్	10,000

38 మెషీన్లు.. రూ.47 కోట్లు

ప్రస్తుతం 38 స్వీపింగ్ మెషీన్లకు ఏటా దాదాపు రూ.47 కోట్లు చెల్లిస్తున్నారు. అయినా రోడ్లపై చెత్త ఉంటోంది. స్వీపింగ్ మెషీన్లతో ఊడిస్తే రోడ్లపై ఎలాంటి చెత్త కనిపించరాదు. కానీ.. పని చేయని చీపుర్లతో ఊడ్చాల్సినంత దూరం ఊడ్చకుండా మమ అనిపిస్తున్నారు. పేరుకు జీపీఎస్ ట్రాకింగ్ అయినా సిస్టమ్ సరిగ్గా లేదని భావించిన కమిషనర్ వాహనాలకు ముందు, వెనుక సీసీ కెమెరాలు అమర్చి పరిశీలించాల్సిందిగా ఆదేశించడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం ఆ చర్యలు ప్రారంభించినట్లు సంబంధిత విభాగం పేర్కొంది.

ఎయిర్‌పోర్టులో ముంబై పోలీస్ మృతి


మృతుడి ఐడెంటిటీ కార్డు

శంషాబాద్: మహారాష్ట్రలోని ముంబైకి చెందిన పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్ పోస్టు సీఐ జె.బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంబై కమిషనరేట్ కాలాచౌకి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్‌ఐ అశోక్ శీతల్, హెడ్ కానిస్టేబుల్ మహేష్ రామారావు (49)తో పాటు మరో కానిస్టేబుల్ అశ్విని ఓ కేసు దర్యాప్తు కోసం ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌కు విమానంలో వెళ్తున్నారు. ట్రాన్సిట్ విమానం కావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఆగిన సమయంలో గేట్ 4 వద్దకు వచ్చిన హెడ్ కానిస్టేబుల్ మహేష్ రామారావుకు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఎయిర్‌పోర్టులో అపోలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హాల్ టికెట్ అందజేతలో ఆలస్యం

పరీక్ష మిస్సయిన ఇంటర్ విద్యార్థి


పరీక్ష కేంద్రం బయట విద్యార్థి నాగేశ్

పరిగి: కళాశాల ఫీజు కట్టకట్టలేదనే కారణంతో సకాలంలో తనకు హాల్ టికెట్ ఇవ్వలేదని, దీంతో పరీక్ష రాయలేకపోయానని ఇంటర్ ఓ విద్యార్థి వాపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీసాయి ఒకేషనల్ జూనియర్ కాలేజీలో నాగేశ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఫస్టియర్ బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసేందుకు మంగళవారం హాల్ టికెట్ కోసం కళాశాలకు వెళ్లాడు. ఫీజు చెల్లించని వారు తర్వాత రావాలని సిబ్బంది సూచించడంతో సాయంత్రం వేళ ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కాలేజీకి వెళ్లి హాల్ టికెట్ తీసుకుని, సెంటర్‌కు చేరుకునే సరికి సమయం 9:20 కావచ్చింది. దీంతో నిర్వాహకులు అతన్ని పరీక్షకు అనుమతించలేదు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తాను పరీక్ష మిస్సయ్యానని బాధితుడు ఆరోపించాడు. ఆ విషయంపై ప్రిన్సిపల్ శ్రీశైలంను వివరణ కోరగా.. విద్యార్థి ఉదయం 8:55 నిమిషాలకు హాల్‌టికెట్ కోసం వచ్చాడని, దీంతోనే ఆలస్యం జరిగిందని తెలిపారు.

సిటీ ఆర్టీసీ.. ఇక కొత్త కొత్తగా..

గ్రేటర్‌లో దశలవారీగా 2800 ఎలక్ట్రిక్ బస్సులు

- ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ కోసం కొత్తగా 10 డిపోలు
- ఒక్కో డిపోలో కనీసం 20 చార్జింగ్ స్టేషన్‌లు
- ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్‌ల నియామకానికి సన్నాహాలు
- క్రమంగా డీజిల్ బస్సుల ఉపసంహరణ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్త బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇప్పుడు ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. రానున్న మూడేళ్లలో 2800 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకనుగుణంగా నగరంలో డిపోల విస్తరణకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ప్రస్తుతం 28 డిపోలు ఉన్నాయి. ఒక్కో డిపోలో కనిష్టంగా 100 నుంచి 150 వరకు బస్సులు ఉన్నాయి. కొన్ని చోట్ల బస్సులను నిలిపేందుకు తగిన స్థలం లేకపోవడంతో డిపోల బయట పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఎలక్ట్రిక్ బస్సుల కోసం కొత్తగా మరో 10 డిపోలను ఏర్పాటు చేయాల్సి ఉంది. బస్సుల నిర్వహణ, చార్జింగ్ స్టేషన్‌ల కోసం అదనపు డిపోలు అవసరమని అధికారులు గుర్తించారు.

చార్జింగ్ సామర్థ్యం పెంచేలా...

కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ కోసం అద్దె ప్రాతిపదికన ఈ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. పీఎం ఈ డ్రైవ్ (పధానమంత్రి ఎలక్ట్రిక్ డ్రైవ్) పథకంలో భాగంగా ఇవి రానున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ చాలావరకు ప్రైవేట్ సంస్థల చేతుల్లోనే ఉంటుంది. కానీ వాటికి పార్కింగ్, విద్యుత్ చార్జింగ్ సదుపాయం కల్పించవలసిన బాధ్యత ఆర్టీసీపైన ఉంది. ప్రస్తుతం ఒక్కో డిపోలో సామర్థ్యానికి మించిన బస్సులు ఉన్నాయి. వాటిని జిల్లాలకు తరలించి ఎలక్ట్రిక్ బస్సులతో డిపోలను భర్తీచేస్తారు. డీజిల్ బస్సుల తరహాలో ఎలక్ట్రిక్ బస్సులను పార్కింగ్ చేయడం సాధ్యం కాదు. వాటికి తగినంత స్థలం ఉండాలి. అలాగే ఇప్పుడు ఒక బంక్ వద్ద అన్ని బస్సులకు కొద్ది గంటల్లోనే డీజిల్ నింపే అవకాశం ఉంది. కానీ ఎలక్ట్రిక్ బస్సులకు విద్యుత్ చార్జింగ్‌కు ఎక్కువ సమయం పడుతుంది. ఈ క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఒకే సారి ఎక్కువ బస్సులకు చార్జింగ్ చేసే సదుపాయం ఉండాలి. ఇందుకోసం ప్రతి డిపోలో కనీసం 20 చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసి ఆ తరువాత అవసరానికనుగుణంగా విస్తరించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఒక్కో డిపోలో 75 నుంచి 80 బస్సులకు మాత్రమే పార్కింగ్, చార్జింగ్ సదుపాయం ఉండేవిధంగా కొత్త డిపోలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెప్పారు. ఇందుకోసం ఆర్టీసీకి ఉన్న సొంత స్థలాలతో పాటు ఓఆర్ఆర్ చుట్టుపక్కల డిపోల కోసం ప్రభుత్వం నుంచి స్థలాలను కోరుతున్నట్లు పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ల నియామకం

కొత్తగా రానున్న ఎలక్ట్రిక్ బస్సులకు ఆయా సంస్థలే డ్రైవర్‌లను ఏర్పాటు చేస్తాయి. దీంతో ఆర్టీసీకి ప్రత్యేకంగా డ్రైవర్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండదు. ఈ మేరకు ప్రస్తుతం పదవీ విరమణ చేస్తున్న డ్రైవర్‌ల స్థానంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొత్తవాళ్లను నియమించుకొనేందుకు సన్నాహాలు చేపట్టారు. డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరిగిన కొద్దీ ఆర్టీసీ డ్రైవర్‌ల అవసరం తగ్గుముఖం పడుతుంది. దీంతో ఇంకా సర్వీసు ఉన్నవాళ్లను జిల్లాల్లోని డిపోలకు బదిలీ చేస్తారు. అదే సమయంలో పదవీకాలం ముగిసిన వాళ్ల స్థానంలో మాత్రం డీజిల్ బస్సుల కోసం తాత్కాలిక పద్ధతిపైన నియమిస్తారు. రానున్న రోజుల్లో ఆ డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టినప్పుడు ఈ తాత్కాలిక డ్రైవర్‌ల అవసరం కూడా ఉండదు. అలాగే ఆర్టీసీ డిపోల్లో మెకానిక్‌లు, శ్రామిక్‌ల నియామకాలు సైతం నిలిచిపోనున్నాయి. 'ఎలక్ట్రిక్ బస్సులను పెంచే క్రమంలో ఆర్టీసీ డ్రైవర్‌లను స్వచ్ఛంద పదవీ విరమణకు సైతం ప్రోత్సహించనున్నట్లు ఒక అధికారి పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలోని వివిధ మార్గాల్లో 254 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సుల్లో ఆర్టీసీ కండక్టర్‌లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆయా సంస్థలకు చెందిన డ్రైవర్లే బస్సులు నడుపుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) డిపోలో పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. దీంతో అక్కడ పని చేసే డ్రైవర్లు, మెకానిక్‌లు, శ్రామిక్‌లు తదితర సిబ్బందిని ఇతర డిపోల్లో సర్దుబాటు చేయవలసి వచ్చింది. తాజాగా హయత్‌నగర్-2 డిపోలో కొత్తగా 45 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టారు. దశలవారీగా మరిన్ని బస్సులు రానున్నాయి.

ఆర్టీసీయే కొనుగోలు చేయాలి...

ఇలా ఉండగా, కేవలం ప్రైవేట్ సంస్థల ఆదాయాన్ని పెంచేందుకు ఆర్టీసీని ప్రభుత్వం బలిపశువును చేస్తోందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆర్టీసీ రూట్లలో ప్రైవేట్ బస్సులను నడిపి భారీ మొత్తంలో వాటికి అద్దెలు చెల్లించడం చాలా కష్టమని, ఆర్టీసీయే సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసుకునేవిధంగా నిధులను అందజేయాలని వివిధ సంఘాలకు చెందిన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సోషల్ మీడియాలో పోస్టింగ్‌లపై వైఎస్సార్ సీపీ నేతల ఫిర్యాదు


ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు వెంకటరమణ తదితరులు

చైతన్యపురి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తులపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు బండారు వెంకటరమణ, నాయకులు మానుకొండ రవీందర్‌రెడ్డి, అక్కోలు శివకుమార్, భరత్‌లు బుధవారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పవన్ స్టార్ మానియా అనే ఇన్‌స్టాగామ్ ఐడీ ద్వారా పెట్టిన పోస్టు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని వారు ఆరోపించారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని వారు కోరారు. ఫిర్యాదు స్వీకరించామని, లీగల్ ఒపీనియన్ తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.

హుండీ చోరీకి విఫలయత్నం

కొందుర్గు: ఆలయంలో చోరీకి యత్నించిన ఓ దుండగుడిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామం సోమలింగేశ్వర స్వామి వారి ఆలయంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సాయికుమార్ బుధవారం ఉదయం ఆలయ పరిసరాల్లో ఎవరూ లేని సమయంలో హుండీలోని డబ్బులు దొంగిలించేందుకు యత్నించాడు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి అతన్ని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ వీరన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కులగణన చరిత్రాత్మకం

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శంషాబాద్: కులగణన చేయడం చరిత్రాత్మక విషయమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ముదిరాజ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో శంషాబాద్‌లోని ఎమ్మెఎస్ గార్డెన్‌లో బుధవారం ముదిరాజ్ కృతజ్ఞత మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కులగణతో ముదిరాజ్‌ల సంఖ్య స్పష్టమైందన్నారు. భవిష్యత్తులో రాజకీయ రంగంలో ముదిరాజ్‌లకు అపారమైన అవకాశాలు దక్కుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేపట్టిన కులగణన ముదిరాజ్‌ల సంఖ్యను బహిర్గత పరిచిందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు విస్తృత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రివర్గంలో కూడా ముదిరాజ్‌ల ప్రాధాన్యం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర, జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెల్లెలి స్నేహితురాలిపై వేధింపులు

యువకుడిపై కేసు

యాచారం: చెల్లెలి స్నేహితురాలిని వేధిస్తున్న ఓ యువకుడిపై యాచారం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గడ్డమల్లయ్యగూడ గ్రామానికి చెందిన ఓ యువతి, మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన మరో యువతి ఇబ్రహీంపట్నంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఆరుట్లకు చెందిన యువతి అన్న రావుల శ్రీకాంత్ గడ్డమల్లయ్యగూడకు చెందిన యువతికి తరచూ ఫోన్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. సదరు యువతి కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరించినా శ్రీకాంత్‌లో మార్పు రాకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యాచారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో దూకి వృద్ధుడి బలవన్మరణం


నర్ల అంజయ్య(ఫైల్)

మంచాల: అనారోగ్యం కారణంగా ఓ వృద్ధుడు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంచాల ఎస్‌ఐ సతీశ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లర్ల అంజయ్య(75) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి ఆయనకు కడుపునొప్పి వచ్చింది. అది భరించలేని ఆయన ఇంట్లో చెప్పకుండా వెళ్లి గ్రామంలోని తుంబావిలోకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం గమనించిన గ్రామస్తులు మృతుడి కుమారుడు లింగస్వామికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేపు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ అదుపుతప్పి..

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ జగదీశ్వర్ తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన భువనగిరి శివకుమార్(55), జమ్మడ రాములుతో కలిసి స్కూటీపై ఉదయం ఇబ్రహీంపట్నం నుంచి కర్ణంగూడ మీదుగా చర్లపటేల్‌గూడకు వెళ్తున్నారు. శ్మశాన వాటిక వద్దకు రాగానే దిచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు ప్రక్కన చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా రాములు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగు రోడ్డు ఫెన్సింగ్ రాడ్‌కు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... తొండుపల్లి శివారులో ఔటర్ రింగు రోడ్డు కింద రైల్వే ట్రాక్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకున్నట్లు ఈ నెల 3న రాత్రి స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి(25)కి సంబంధించి ఎలాంటి ఆచూకీ లభించలేదు. మృతుడి ఒంటిపై నీలిరంగు టీ షర్టు, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

పీఅండ్‌టీ కాలనీలో అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

బండ్లగూడ: అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని నేలమట్టం చేస్తామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను బుధవారం మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా సెట్ బాక్స్‌లు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామన్నారని కమిషనర్ శరత్‌చంద్ర స్పష్టం చేశారు. అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని వాటిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలందరూ నిబంధనలకు అనుగుణంగా తమ నిర్మాణాలను చేపట్టుకోవాలని సూచించారు. నిర్మాణాలు చేపట్టే సమయంలో పూర్తి అనుమతులు తీసుకోవాలని... ఆ తర్వాతే నిర్మాణాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం చూసేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదానికి గురైన ఇంటర్ విద్యార్థి

తాండూరు టౌన్: తెల్లారితే పరీక్ష ఉండటంతో సెంటర్ ఎక్కడ ఉందో చూసేందుకు బైకుపై వెళ్తున్న ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. తాండూరు మండలం సిరిగిరిపేట్‌కు చెందిన శ్రీకాంత్ అనే విద్యార్థి తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నాడు. పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో చూసేందుకు బైకుపై ఇందిరాచౌక్ నుంచి హైదరాబాద్ రోడ్డు మార్గంలో వెళ్తుండగా.. రాయల్‌కాంటా వద్ద టర్నింగ్ తీసుకుంటున్న జనగాం గ్రామానికి చెందిన పట్నం సుధాకర్ బైకు ఢీకొన్నాయి. దీంతో కిందపడిన శ్రీకాంత్ తలకు తీవ్ర గాయమైంది. సమాచారం మేరకు 108లో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం


రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

మెగా ఎంఎస్ఎంఈ క్యాంపులో రుణాల అందజేత

శంషాబాద్ రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంపులతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహంతో పాటు మేక్ ఇన్ ఇండియాకు నూతన శక్తిని ఇస్తుందని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఎం.శ్రీలక్ష్మీ అన్నారు. బ్యాంకు సైఫాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని ముచ్చింతల్‌లో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో బుధవారం మెగా ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంపు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ ఉత్పాదనలపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పించారు. సుమారు రూ. వంద కోట్లకు సంబంధించిన రుణ మంజూరు పత్రాలను 50 మంది ఖాతాదారులకు అందజేశారు. ఎంఎస్ఎంఈ సెక్టార్ రుణాలు దేశంలో 30 శాతం జీడీపీతో దేశానికి వెన్నుముకంగా ఉన్నామని ఎంఎస్ఎంఈ వెర్టికల్ సీఓ ముంబయి జనరల్ మేనేజర్ జి.కె.సుధాకర్‌రావు అన్నారు. వివిధ రకాల ఉత్పత్తుల తయారీ రంగంలో 45 శాతం వాటాతో పాటు దేశంలో 65 శాతంపైగా యువతకు జీవనోపాధి కల్పిస్తుందన్నారు. ఇలాంటి మెగా క్యాంపులను దేశంలోని 157 కేంద్రాల్లో మార్చి 3 నుంచి 7 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు హైదరాబాద్ జనరల్ మేనేజర్ ఆర్.ఎల్.పట్నాయక్, డీజీఎం సోనాలిక, ఏజీఎంలు రవి, జగదీశ్, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.

పెడ్లర్ అరెస్ట్: 10 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్

అడ్డగుట్ట: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి నగరంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న ఓ పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెల్పిన మేరకు... ఒడిశా రాష్ట్రం గంజామ్ జిల్లాకు చెందిన భూషణ్ పళాయి అలియాస్ రాజు 2007లో నగరానికి వచ్చి ఇక్కడ వివిధ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవలి కాలంలో జేసీబీ డ్రైవర్‌గా కూడా పని చేసిన భూషణ్‌కు కన్‌స్ట్రక్షన్ సైట్‌లో కొందరు కూలీలు గంజాయి తీసుకోవడం గమనించాడు. ఈ క్రమంలో తన ఊరు నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడి కూలీలకు విక్రయించాలని అనుకున్నాడు. అందులో భాగంగా ఒడిశాలో తనకు పరిచయస్థుడైన రాహుల్ అనే సప్లయర్ నుంచి రూ.5 వేలకు కిలో గంజాయి చొప్పున కొనుగోలు చేసి హైద్రాబాద్‌లో అధిక డబ్బులకు విక్రయించేవాడు. చిన్న చిన్న శాచెట్ల నుంచి 100 గ్రాములు, 250 గ్రాముల వరకు గంజాయి విక్రయాలకు పాల్పడుతూ డబ్బులు సంపాదించేవాడు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న హైద్రాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, తుకారాంగేట్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఈ నెల 3న ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్ సమీపంలోని రైలుపట్టాల పక్కన ఖాళీ స్థలం వద్ద భూషణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద దొరికిన 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, దర్యాప్తులో భాగంగా భూషణ్ నివసించే కోకాపేటలోని ఇంటికి వెళ్లి అక్కడ నిలువ ఉంచిన సుమారు పది కిలోల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా నిందితుడి నుంచి 10 కిలోల గంజాయితో పాటు ఒక ద్విచక్ర వాహనం, వెయిట్ మెషీన్, సెల్‌ఫోన్, రూ.1,210 నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో హెచ్‌ఎన్‌ఈడబ్ల్యూ ఇన్‌స్పెక్టర్ జీఎస్ డేనియల్, ఎస్‌ఐ వెంకటరాములు, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.